# ప్రజా చైతన్య వేదిక

(అవినీతి, అసమానతల ప్రతిఘటన వేదిక)

స్థాపితము : 23-03-1997

(7)

**కొమ్మిడి నర్సింహ్మారెడ్డి**
Ex-MLA భువనగిరి.
కన్వీనర్, ప్రజా చైతన్య వేదిక

బ్రాహ్మణపల్లి గ్రామం,
బీబీనగర్ మండలం,
నల్గొండ జిల్లా - 508 126.
ఫోన్ : 040-27196098
సెల్ : 9441286411
e-mail: kommidinreddy@yahoo.com

TSERC, HYDERABAD
INWARD
28 FEB 2015
No. 318 Signature

**శ్రీయుత గౌరవ అధ్యక్షులు,**

తెలంగాణ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ గారికి,

నమస్కారములు

విషయం: TSERC వారిచే 2015-16 విద్యుత్ టారిఫ్ రేట్ల నిర్ధారణ కోసం నిర్వహించనున్న "బహిరంగ విచారణ"లో అసంఘటిత వినియోగదారులైన "గృహ, వ్యవసాయ, కుటీర పరిశ్రమల" వారి సాధక బాధకాలను కమిషన్ వారి సమగ్ర పరిశీలన కోసం 'ప్రజా చైతన్య వేదిక' వాదనలు వినిపించుట గురించి - విజ్ఞప్తి.

- - -

1959వ సంవత్సరంలో సొంత పెట్టుబడి (మూలధనం) లేకుండానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డును స్థాపించారు. ప్రభుత్వ విరాళాలు, ఆర్థిక సంస్థల అప్పులు, ప్రజా సహకారం ద్వారా మూడు శాతం లాభాల లక్ష్యంగా అది ఏర్పడింది. సామాజిక బాధ్యతతలో ప్రజలకు విస్తృతంగా సేవలను అందిస్తూనే, తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించి 1998 నాటికి రమారమిగా దిగువ పేర్కొన్న ఆస్తులను సమకూర్చుకొంది.

ఉత్పత్తి : 2,954 మెగావాట్ల థర్మల్ విద్యుత్, 2,673 మెగావాట్ల జల విద్యుత్, 272 మెగావాట్ల గ్యాస్ ఆధారిత విద్యుత్, రెండు మెగావాట్ల గాలి మరల విద్యుత్‌తో మొత్తం 5,901 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం సమకూర్చుకొంది. ఎన్.టి.పి.సి. ద్వారా 1,500 మెగావాట్లు + 1,366 మెగావాట్ల ప్రయివేటు విద్యుత్ కలిపి మొత్తం 8,767 మెగావాట్ల విద్యుత్ పంపిణీ సామర్థ్యం గల వ్యవస్థను రూపొందించుకొంది. 26,565 గ్రామాలు, 27,849 శివారు గ్రామాలు, 41,466 దళిత వాడలు, 16,220 బలహీన వర్గాల కాలనీలు, 20,48,520 వ్యవసాయ బావులు కలిపి 1,44,19,475 వినియోగదారులకు విద్యుత్‌ను సరఫరా చేసే వ్యవస్థను నిర్మించుకొంది.

**పై వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసేందుకు దిగువ పేర్కొన్న మౌలిక వ్యవస్థను రూపొందించుకొంది.**

400 కె.వి. సామర్థ్యం గల 287 కి.మీ. లైను, 220 కె.వి. సామర్థ్యం గల 1,029 కి.మీ. లైను, 132 కె.వి. సామర్థ్యంలో 12,439 కి. మీ. లైను, 33 కె.వి. సామర్థ్యం గల 32,325 కి.మీ. లైను, 11 కె.వి. పంపిణీ సామర్థ్యంతో 1,73,092 కి.మీ. లైను సుమారుగా అయిదు లక్షల కి.మీ. ఎల్.టి. లైను, 2,25,553 పంపిణీ ట్రాన్స్‌ఫారమ్‌లు, 88,444 ఉద్యోగులతో కలిపి మొత్తం సుమారుగా 80,000 కోట్ల ఆస్తిని సమకూర్చుకొంది.

పి.పి.ఎఫ్. ఉత్పత్తి సామర్థ్యంలో 92 శాతం సాధించి జాతీయ స్థాయిలో అనేక అవార్డులను సాధించింది. 1995లో 'పియర్‌లెస్' ఆర్థిక సంస్థకు జామీనుగా ఉండి తన యజమాని (రాష్ట్ర ప్రభుత్వం) కి 400 కోట్ల రూపాయల అప్పును ఇప్పించింది. ప్రజల కనీసావసర వస్తువుగా రూపాంతరం చెందిన విద్యుత్ శక్తిని సామాజిక బాధ్యతతో వినియోగదారులకు అందించేందుకు సామాజిక స్పృహతో తన బాధ్యతను నెరవేర్చేందుకు కృషి చేసింది విద్యుత్ బోర్డు.

సంస్కరణలు: పంపిణీ వ్యవస్థను విస్తృత పరిచేందుకు సామర్థ్యాన్ని పెంచుకొనేందుకు 4,000 కోట్ల రూపాయలు అవసరమౌతున్నవి. వాటిని సమకూర్చుకొనేందుకు విద్యుత్ బోర్డుకు సామర్థ్యం లేదు. ప్రపంచ బ్యాంకు ద్వారా మాత్రమే అది సాధ్యం. అందుకోసం ప్రపంచ బ్యాంకు నుంచి అప్పు పొందేందుకు ప్రభుత్వం విద్యుత్ బోర్డునకు ఉన్న సామాజిక బాధ్యతను తప్పించింది. దానిని వ్యాపార సంస్థగా మార్చేందుకు ప్రభుత్వం సంకల్పించింది. దీంతో ప్రజలను పౌరులుగా పరిగణించకుండా వినియోగదారులుగా మార్చేశారు. విద్యుత్ బోర్డును 1. జెన్‌కో, 2. ట్రాన్స్‌కో, 3. డిస్కమ్‌లుగా విభజించి వ్యాపార సంస్థలుగా చేసారు.

విద్యుత్ శక్తిని వ్యాపారంగా మార్చిన నేపథ్యంలో అసంఘటిత వినియోగదారులు (గృహ, వ్యవసాయ, కుటీర పరిశ్రమలు) తీవ్ర ఆందోళనకు, అభద్రతకు గురవుతున్నారు. ప్రభుత్వాలు మొదటగా స్లాబులను పెంచినారు, గత సంవత్సరము నుంచి యూనిట్లు స్లాబులుగా వినియోగదారులపై అధికభారం వేశారు.

**గృహ వినియోగదారులు:** మూడు దశాబ్దాల క్రిందట పెద్ద భవంతి అయినా, చిన్న చిల్లు అయినా, పూరిపాక అయినా చీకటి పడగానే వెలుతురు కోసం వాటికి దీపాలు అవసరం అయ్యేవి. ఆధునికత పేరుతో ప్రస్తుతం నిర్మించే గృహాలకు గాలి, వెలుతురుకు సైతం విద్యుత్ ఆధారితమైంది. విద్యుత్ లేకుండా నీరు సైతం లభించడం లేదు. గృహవినియోగదారులు పెరిగిన చార్జీలకు అనుగుణంగా తమ సంపాదనను పెంచుకోలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

**కుటీర పరిశ్రమలు:** బహుళ జాతి పరిశ్రమలు రిటైల్, ఉత్పత్తి, వ్యాపారాలు చేపట్టిన క్రమంలో కుటీర పరిశ్రమల వారికి పూర్తికాల పని లభించడం లేదు. పంట ఉత్పత్తి సీజన్‌లో మాత్రమే పని లభిస్తోంది.

**వ్యవసాయం:** నీటి పారుదల సౌకర్యం ఉన్న రైతులు తక్కువ శ్రమ, తక్కువ పెట్టుబడితో ఉత్పత్తి చేయగలరు. భూగర్భ జల ఆధార వ్యవసాయదారుల అధిక శ్రమ, అధిక పెట్టుబడి పెట్టి అందుకు అనుగుణంగా ఉత్పత్తులకు ధర నిర్ణయించలేని నిస్సహాయ దుస్థితి ఏర్పడినది.

తెలంగాణలో కృష్ణా, గోదావరి నదులు ప్రవహిస్తున్నాయి. తూర్పు కనుమలు, పశ్చిమ కనుమలు విస్తరించాయి. ఉత్తరాదిన వింధ్య పర్వతాల మధ్యన సముద్ర మట్టం కన్నా 700 మీటర్లకు పైగా ఎత్తయిన పీఠభూమిగా ఉన్నందున భూగర్భ జలాలపై వ్యవసాయం విద్యుత్‌పై ఆధారపడాల్సిన నిస్సహాయ స్థితి నెలకొని ఉంది. దేశంలో ఏ ఇతర రాష్ట్రంలో లేని భిన్నమైన భౌగోళిక పరిస్థితి తెలంగాణ రాష్ట్రానిది.

రెగ్యులేటరీ కమిషన్ వారు నిర్దేశించిన "స్టాండర్డ్స్ ఆఫ్ ఫర్మార్మెన్స్" చర్యలను పటిష్టంగా అమలు చేయాలని కోరుతున్నాను.

విద్యుత్ సంస్థకు వచ్చే నష్టాలకు వ్యవసాయ విద్యుత్‌యే కారణమని తేల్చడం దురదృష్టకరం. 'ప్రకృతిలో పుట్టి, ప్రకృతిని నమ్మి, ప్రకృతిని నిరంతరం కాపాడుతున్న' మట్టి మనిషి వ్యవసాయదారుడు, వృక్ష సంపద, పశు పక్ష్యాదులను కాపాడడమే కాకుండా సంస్కృతిని సైతం కాపాడుతున్నాడు. అందరికి ఇచ్చే వాడే కాని, చేయి చాచి అడిగేవాడు కాదు రైతు. ప్రకృతి మూలాధారమైన రైతును చేయని తప్పుకు బలి చేయడం సరికాదు.

ప్రతిపాదనలు:

1) వ్యవసాయ విద్యుత్‌కు యూనిట్ ఒక్కింటికి 0.10 పైసల నుంచి 0.20 పైసల వరకు (జల విద్యుత్ ఉత్పత్తి వ్యయంతో సమానంగా) విద్యుత్ టారిఫ్‌లను నిర్ధారించి నిరంత విద్యుత్ సరఫరా చేయాలని ప్రజా చైతన్య వేదిక ప్రతిపాదిస్తోంది.

2) 5 హెచ్.పి. లోపు విద్యుత్‌ను వినియోగించు చిన్న పరిశ్రమలను కుటీర పరిశ్రమలుగా గుర్తించడం సమంజసమని భావిస్తున్నాం.

3) గృహ, వ్యాపార వినియోగదారులకు తాము చేయని పొరపాట్లకు బాధ్యులను చేస్తూ మానసిక హింసకు గురి చేయకుండా, ఉద్యోగులు వినియోగదారులతో సుహృద్భావంతో, స్నేహపూర్వకంగా మెలిగేటా చర్యలు గైకొనాలి.

4) హెచ్.టి. 4 లో టౌన్‌షిప్, కాలనీలను ఏ,బి,సి. లుగా మార్పు చేసి టారిఫ్ రేట్లను సవరించాలి.

ప్రజలను కన్నబిడ్డలుగా చూడాల్సిన ప్రభుత్వం అభివృద్ధి చెందిన దేశాల ప్రభావంతో బహుళజాతి కంపెనీల కంటే స్వలాభాపేక్షతో ప్రజలను పౌరులుగా చూసేందుకు బదులు కేవలం వినియోగదారులుగా చేసే పరిస్థితి దాపురించింది. కన్నతల్లే తన బలహీనమైన సంతానానికి బలవర్ధక ఆహారాన్ని ఇచ్చేందుకు బదులుగా 'పూటకూళ్ల ఇంటి'కే పంపించారు. కన్నతల్లి ఎదురుగా ఉండి కూడా అనాధలైన బిడ్డలు, గృహ, వ్యవసాయ, కుటీర పరిశ్రమల వినియోగదారులు, ఈ అనాధలపై ఇదివరకే శ్రద్ధ చూపి విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ వారు కొన్ని ఎస్.పి.ఓ. మార్గదర్శకాలను నిర్దేశించారు. కానీ వాటిని సరైన తీరులో ప్రచారం చేయడం లేదు. అమలు అసలే లేదు.

కాబట్టి, ఈ నిస్సహాయులైన వినియోగదారుల స్థితిగతులను ప్రత్యేకంగా పరిగణించి, పరిశీలించి విద్యుత్ కంపెనీలకు తగు మార్గదర్శకాలను చేసి అమలు చేయాల్సిందిగా విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ గౌరవ చైర్మన్ గారిని, గౌరవ సభ్యులను కోరుతున్నాను.

ధన్యవాదములతో . . .

భవదీయుడు

K. N. Reddy

**కొమ్మిడి నర్సింహ్మారెడ్డి**

*Ex-MLA* భువనగిరి.

కన్వీనర్, ప్రజా చైతన్య వేదిక

దీని ప్రతులు:

1) The Chief General manager (Commercial)

2) T.S.C.P.D.C.L., Mint Compound, Hyderabad.